ప్రతిభా పురస్కారాల ఊసేదీ?

గత ప్రభుత్వంలో జగనన్న ఆణిముత్యాల పేరుతో ప్రదానం

- ఏటా పది, ఇంటర్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు
- రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో అందజేత
- అబ్దుల్‌కలాం ప్రతిభా పురస్కారాలుగా పేరు మార్చిన కూటమి ప్రభుత్వం
- గత విద్యాసంవత్సరం టాపర్లకు ఇప్పటి వరకు ప్రదానం చేయని వైనం



పదిలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్(ఫైల్)

దుత్తలూరు: కూటమి ప్రభుత్వం సర్కారు బడులు, కళాశాలల్లోని విద్యార్థులను చిన్నచూపు చూస్తోంది. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' పథకం కింద రూ.15 వేలు చొప్పున నగదు అందజేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నగదును ఇవ్వడం కూడా మరిచిపోయింది. అదే కోవలో గత విద్యాసంవత్సరంలో పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు అందజేసే ప్రతిభాపురస్కారాలపైన ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పదోతరగతి, ఇంటర్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు పేరుతో పురస్కారాలను ప్రకటించింది. అందులో భాగంగా ఏటా పది, ఇంటర్‌లో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి నగదు ప్రోత్సాహకాలను అందజేసింది. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానానికి రూ.లక్ష, ద్వితీయస్థానానికి రూ.75వేలు, తృతీయ స్థానానికి రూ.50వేలు చొప్పున నగదు పురస్కారాలను అందజేసేది. అలాగే నగదు ప్రోత్సాహకాలను కేవలం రాష్ట్రస్థాయికే పరిమితం చేయకుండా నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.15 వేలు, ద్వితీయస్థానానికి రూ.10 వేలు, తృతీయ స్థానానికి రూ.5 వేలు చొప్పున అందజేశారు. అలాగే జిల్లాస్థాయిలో ప్రథమ స్థానానికి రూ.50 వేలు, ద్వితీయ స్థానానికి రూ.30 వేలు, తృతీయ స్థానానికి రూ.15 వేలు వంతున అందజేశారు. ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు దాతలు కూడా ముందుకొచ్చి పాఠశాల స్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. రాష్ట్రస్థాయిలో ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపల్స్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా సత్కరించి నగదు ప్రోత్సాహకాలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహించారు. అందుకనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కూడా పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇలా 2022–2023 విద్యాసంవత్సరం వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా పురస్కారాలను అందజేసి విద్యార్థులను ప్రోత్సహించింది.

పురస్కారాలకు విద్యార్థుల నిరీక్షణ

జిల్లాలో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 24,500 మంది ఉత్తీర్ణులయ్యారు.



పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 17,292 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 2024–25లో ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి సుమారు 25వేల మంది పరీక్షలు రాశారు. ప్రస్తుతం 33వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. గత విద్యాసంవత్సరంలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకే ఇప్పటి వరకు ప్రతిభా పురస్కారాలు అందజేయకపోవడంతో ఈ విద్యాసంవత్సరం పరీక్షలకు హాజరైన విద్యార్థులు కూడా సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఇవ్వకుండా ఎగనామం పెట్టింది. ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నగదును విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అట్టహాసంగా పథకాల పేర్లు మార్చి వాటిని అమలు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రోత్సాహక నగదు పురస్కారాలను అందజేయాలని పలువురు కోరుతున్నారు.

పేరు మార్చారు.. మార్గదర్శకాలు మరిచారు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం పేరును ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాలుగా మార్చింది. అందుకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏటా జూలై 20వ తేదీ నాటికే పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు అన్ని స్థాయిల్లో నగదు ప్రోత్సాహకాలను అందజేసేవారు. దీంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి కూడా గొప్ప స్పందన లభించింది. కాగా 2024 మార్చిలో పది, ఇంటర్ పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం నగదు పురస్కారాలను అందజేస్తుందని భావించారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ప్రతిభా పురస్కారాలు ప్రశ్నార్థకంగా మారాయి. గతేడాది విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అందకపోవడంతో అధికారులు కూడా ఏమీ చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు.

క్లుప్తంగా

హెచ్‌ఎంలకు డ్రాపౌట్స్ వివరాలు



ఉదయగిరి: మండలంలోని పాఠశాలల పరిధిలోని డ్రాపౌట్స్, రీ జాయినింగ్ అయిన విద్యార్థుల వివరాలను హెచ్‌ఎంలకు తెలియజేయాలని ఎంఈఓ–1 షేక్ మస్తాన్‌వలీ సీఆర్ఎంటీలకు సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో సీఆర్‌ఎంటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాప్–4 పరీక్షలకు సంబంధించిన మార్కులను త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. విద్యార్థుల ఆధార్, ఆపార్ ఐడీల వివరాలు సీఆర్‌ఎంటీల వద్ద ఉండాలన్నారు. డిప్యుటేషన్‌లపై పాఠశాలలకు వెళ్లినప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాలన్నారు. ఆన్‌లైన్ యాక్టివిటీస్‌ను ఎప్పటికప్పుడు పూర్తిచేసేలా హెచ్‌ఎంలకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం ఏపీ గురుకుల ప్రవేశ పరీక్షకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఎంఈఓ ఆవిష్కరించారు.

ఆనకట్ట సుందరీకరణ పనులపై పరిశీలన



సుందరీకరణ పనులపై సూచనలు చేస్తున్న ఈఈ వెంకటేశ్వర్లు


ఉదయగిరి: ఉదయగిరి ఆనకట్ట సుందరీకరణ పనులపై ఆత్మకూరు జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామకొలను పథకంలో భాగంగా ఉదయగిరి ఆనకట్టను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటికే కట్ట రివిట్‌మెంట్, మట్టి పనులను పూర్తి చేశామన్నారు. కట్టపై పార్కింగ్ టైల్స్, సోలార్ దీపాలు, బెంచీల ఏర్పాటు, తదితర పనులు చేపట్టాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించి కొలతలు సేకరిస్తున్నామని తెలిపారు. నెలరోజుల్లో సుందరీకరణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డీఈఈ కే చంద్రమౌళి, ఏఈ వేణు, కాంట్రాక్టర్ ఏ భాస్కరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



సంగం: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఎంపీడీఓ షాలెట్ గురువారం పరిశీలించారు. మండలంలో ఈ నెల 19 నుంచి 22, 25 నుంచి 28వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉగాది క్యాలెండర్ల పంపిణీ



సీతారామపురం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రి, కెనరా బ్యాంకు, పోలీస్‌స్టేషన్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి దుత్తలూరు కమిటీ ఆధ్వర్యంలో తెలుగు సంవత్సర ఉగాది క్యాలెండర్లను గురువారం పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు సుధాకర్, పెంచలరత్నం, నరసింహులు, మాలకొండారెడ్డి, రమణారెడ్డి, మధుసూదన్‌రావు, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు నిర్మించాలని విజ్ఞప్తి



హైవేను ఎత్తుగా నిర్మించడంతో లోతట్టులోకి వెళ్లిన ఇళ్లు

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి సెంటర్‌లో జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. బసినేనిపల్లి సెంటర్‌లో ఐదు అడుగుల మేర ఎత్తుగా జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. దీంతో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గృహాలు లోతట్టుగా మారి మురుగు బయటకు వెళ్లక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. హైవే నిర్మాణదారులు స్పందించి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇరువైపులా డ్రైనేజీలను నిర్మించాలని వారు కోరుతున్నారు.

ఆత్మరక్షణపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు ఆత్మరక్షణపై ఎస్సై రఘునాథ్ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు చిన్నతనం నుంచే ధైర్యాన్ని అలవర్చుకుని ముందుకు సాగాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఎదుటివారిని ఎదుర్కొనేందుకు ఆత్మరక్షణకు కరాటేను నేర్చుకోవాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల, మహిళల రక్షణకు ఎన్నో చట్టాలను రూపొందిస్తున్నాయన్నారు. అత్యవసరమైతే పోలీసు నంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

23న వెలిగొండ సాధన సమితి సమావేశం



దుత్తలూరు: దుత్తలూరు ఉదయగిరిలోని షాదీ మంజిల్‌లో ఈ 23న వెలిగొండ సాధన సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ సమితి సభ్యులు తెలిపారు. గురువారం వారు దుత్తలూరులోని ఓ పెట్రోలు బంకు ఆవరణలో మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, కంభం విజయరామిరెడ్డిని కలిసి సమావేశానికి ఆహ్వానించారు. వెలిగొండ జలాల సాధనకు తాము చేపడుతున్న పోరాటానికి సంఘీభావం తెలపాలని కోరారు. సాధన సమితి సభ్యులు ఉదయగిరి, దుత్తలూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఇవ్వండి సారూ..

- తహసీల్దార్‌కు 16,17 వార్డు మహిళల వినతి

ఆత్మకూరు: తమకు రెండు నెలలుగా రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదు..ఈ నెల రేషన్ సరుకులు ఇచ్చే బండి అతన్ని అడిగితే సమయం అయిపోయిందని ఇవ్వలేదు..తమకు బియ్యం ఇప్పించాలని మున్సిపల్ పరిధిలోని 16, 17 వార్డులకు చెందిన మహిళలు ఆత్మకూరు తహసీల్దార్ సుధీర్‌ను వేడుకున్నారు. గురువారం 16,17 వార్డులకు చెందిన మహిళలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రేషన్ డీలర్‌ను అడిగితే రేషన్ బండి వారిపై చెబుతుందని, వారిని అడిగితే యాప్ ముగిసిందని చెబుతున్నారని వాపోయారు. స్పందించిన తహసీల్దార్ ఎండీయూ ఆపరేటర్లను పిలిపించి మాట్లాడారు. తమకు కేటాయించిన పరిధిలోనే సరఫరా చేశామని వారు విన్నవించగా, 16, 17 వార్డుల పరిధిలో పూర్తి స్థాయిలో ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన మహిళలు

17వ తేదీ నాటికే యాప్ ఓపెన్ కాలేదని ఎండీయూ ఆపరేటర్లు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. పేదలకు బియ్యం ఇవ్వకపోవడం సరికాదని, ఇలాంటి పరిస్థితులు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. వచ్చే నెలలో పూర్తి స్థాయిలో బియ్యం లబ్ధిదారులకు అందజేసిన వారికే జీతాలు చెల్లిస్తామన్నారు. వార్డుకు చెందిన మహిళలు సైరాబి, బీబీజాన్, శైలమ్మ, నూర్జహాన్, బండారు జయమ్మ, మహబున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను పక్కాగా నిర్వహించాలి

దుత్తలూరు: మండలంలోని రాచవారిపల్లిలో చేపడుతున్న భూముల రీసర్వేను కావలి ఆర్డీఓ వంశీకృష్ణ బుధవారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. రీసర్వేను పక్కాగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి వీఆర్వోలు, సర్వేయర్లు రైతుల భూముల వద్దకే వచ్చి సర్వే చేపడుతున్నారని తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని సిబ్బందికి అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ యనమల నాగరాజు, సర్వేయర్ శివ, వీఆర్వోలు ఉన్నారు.



భూరికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

హైవేపైకి మూగజీవాలు..
నిత్యం ప్రమాదాలు



జాతీయ రహదారిపై సంచరిస్తున్న గేదెలు

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని ఉప్పలపాడు నుంచి మర్రిపాడు మండలం చుంచులూరు వరకు 565వ నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. తెలంగాణ నుంచి తిరుపతికి వెళ్లేందుకు దగ్గరి మార్గం కావడంతో జాతీయ రహదారిపై నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. అయితే హైవే పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు పాడి పశువులను మేత కోసం వదిలేస్తుండడంతో అవి హైవేపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో పశువులు కనిపించక వాటిని ఢీకొని వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. ఇటీవల నెల రోజుల వ్యవధిలో రెండు కార్లు జాతీయరహదారిపైకి వచ్చిన గేదెలను ఢీకొనడంతో అందులోని ప్రయాణికులు తీవ్ర గాయాల పాలయ్యారు. వాహనాలు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. మూగజీవాలు సైతం మృత్యువాత పడ్డాయి. ఈ విషయమై రైతులకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ఫలితం ఉండడం లేదు. ఇప్పటికైనా జాతీయ రహదారి భద్రత అధికారులు స్పందించి గేదెలు రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. ఈ విషయమై సోమశిల ఎస్సై అనూషను వివరణ కోరగా హైవే పరిసర ప్రాంత గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పశువుల కొమ్ములకు రేడియం పెయింట్లను ఉపయోగించాలని సూచిస్తున్నామని చెప్పారు. ఇకపై పశువుల కారణంగా ప్రమాదాలు జరిగితే పశువుల యజమానులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



గేదెలను తప్పించబోయి బోల్తాపడిన కారు(ఫైల్)

మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ

సీతారామపురం: మండలంలోని మహిళల నుంచి ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ గురువారం తెలిపారు. బీసీలు 22, కమ్మ 11, రెడ్డి 16, కాపు 4, ఈబీసీ 11, ఆర్యవైశ్య 5, బ్రాహ్మణ 3, క్షత్రియ 1 చొప్పున మొత్తం 73 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణకు సక్రమంగా హాజరై సర్టిఫికెట్ పొందిన వారికి కుట్టుమెషీన్లను సైతం ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పాతకక్షల నేపథ్యంలో గొడ్డలితో దాడి

- ముగ్గురికి గాయాలు

జలదంకి: పాతకక్షల నేపథ్యంలో ఇద్దరు మహిళలతో పాటు ఓ వ్యక్తిపై మరో వ్యక్తి గొడ్డలితో దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని కమ్మవారిపాళెంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. కమ్మవారిపాళేనికి చెందిన కర్రిఆవుల కుమార్ ఆదే గ్రామానికి చెందిన పమిడి రాములమ్మ, ఆమె సోదరి విజయమ్మ, కుమారుడు శివప్రసాద్‌పై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. పాతకక్షల నేపథ్యంలో పమిడి రాములమ్మ ఇంటికి వెళ్లి ముగ్గురిపై దాడి చేసి గాయపరిచాడు. వారిని బంధువు చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు జలదంకి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గువ్వాడిలో 104 వాహన సేవలు

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడిలో 104 వాహన సేవలను గురువారం అందజేశారు. వైద్యాధికారిణి కరీష్మా 37 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతుల ప్రదానం



ఉదయగిరి: స్థానిక ఆర్టీసీ డిపోలో గిఫ్ట్ స్కీం విజేతలకు డిపో మేనేజర్ ఎం శ్రీనివాసరావు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఉదయగిరి– సీతారామపురం మార్గంలో ప్రయాణికులను ప్రోత్సహించేందుకు గిఫ్ట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా లక్కీడ్రా తీయగా షేక్ జాఫర్‌హుస్సేనీ, ద్వితీయ బహుమతి షేక్ సమీనా దక్కించుకున్నారని వివరించారు. ఆర్టీసీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూఆక్రమణపై ఫిర్యాదు

అనుమసముద్రంపేట: తమ భూమిని ఇతరులు ఆక్రమించడంపై గుంపర్లపాడుకు చెందిన నంబూరి మధుసూదన్‌రావు తహసీల్దార్‌తో పాటు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు..గుంపర్లపాడుకు చెందిన నంబూరి మధుసూదన్‌రావుకు సర్వే నంబర్లు 418, 419లో 4.80 ఎకరాల భూమి ఉంది. అందులో కొంతభాగాన్ని ఇటీవల చుట్టుపక్కల పొలాల వారు ఆక్రమించుకోవడమే కాకుండా అడిగితే బెదిరిస్తున్నారు. గురువారం మధుసూదన్‌రావు తన పొలానికి నీరు పెడుతుండగా రామాంజనేయులు, మరో వ్యక్తి కలిసి భూమిలో నుంచి గెంటేశారు. అంతటితో ఆగకుండా అతనిపై దౌర్జన్యం చేస్తూ నీకు భూమిపై హక్కు లేదంటూ అక్కడి నుంచి తరిమేశారు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ తహసీల్దార్ రామకృష్ణ, ఎస్సై సైదులుకు ఫిర్యాదు చేశారు. కాగా స్పందించి న్యాయం చేయాల్సిన రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు కొమ్ముకాస్తూ పట్టించుకోలేదని బాధితుడు ఆరోపిస్తున్నా రు. ఈ విషయమై జిల్లా రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



పాసుపుస్తకాన్ని చూపిస్తున్న బాధితుడు

గేట్‌లో మెరిసిన పేదింటి బిడ్డ

ఉదయగిరి: మండలంలోని జీ చెరువుపల్లి పంచాయతీ పరిధిలోని వడ్డిపాళేనికి చెందిన దేవండ్ల వెంకటయ్య, నరసమ్మ దంపతుల కుమారుడైన శేఖర్‌గేట్ పరీక్షలో ప్రతిభకనబరిచాడు. ఆలిండియా స్థాయిలో ఈసీఈ విభాగంలో 425వ ర్యాంకు సాధించాడు. శేఖర్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. తల్లి కూలి పనులకు వెళుతూ కష్టపడి చదివించింది. శేఖర్ ప్రాథమిక విద్యను గ్రామంలోనే పూర్తిచేశాడు. అనంతరం 10వ తరగతి వరకు నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్మీడియట్‌ను ఉదయగిరిలోని మేకపాటి వెంకురెడ్డి జూనియర్ కళాశాల, బీటెక్‌ను కలికిరిలో పూర్తిచేశాడు. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉన్న శేఖర్ ఎలాంటి శిక్షణ తీసుకోకుండానే గేట్ పరీక్ష రాసి తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించాడు. ఐఐటీలో ఎంటెక్ పూర్తిచేసి మంచి ఉద్యోగం సంపాదించడమే తన ధ్యేయమని శేఖర్ పేర్కొన్నాడు. కాగా శేఖర్‌కు మిత్రులు, బంధువులు అభినందనలు తెలియజేశారు.



దేవండ్ల శేఖర్

సతీష్‌రెడ్డికి పదవిపై హర్షం

ఆత్మకూరు: మండలంలోని మహిమలూరుకు చెందిన భారత రక్షణ శాఖ సలహాదారు, డీఆర్డీఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా నియమితులవడంపై ఆత్మకూరుతో పాటు స్వగ్రామానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు. మహిమలూరుకు చెందిన సతీష్‌రెడ్డి రైతు బిడ్డ. స్వగ్రామంలోనే ప్రాథమిక విద్యతో పాటు హైస్కూల్ విద్యను పూర్తి చేశారు. అనంతరం నెల్లూరులోని వీఆర్ కళాశాలలో ఇంటర్, ఆ తరువాత జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం అంతరిక్ష శాస్త్రవేత్తగా జీవితం ప్రారంభించారు. దివంగత రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం శిష్యుడిగా రాణించి డీఆర్డీఓ చైర్మన్‌గా సేవలందించారు. ప్రస్తుతం భారత రక్షణ మంత్రి సలహాదారుడిగా, ఇండియన్ ఏరోనాటికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారునిగా కేబినేట్ హోదాలో నియమితులవడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

న్యాయం చేయాలని మహిళ వేడుకోలు

జలదంకి: కోర్టు ఆదేశాలను ధిక్కరించి తమ పొలంలోని జామాయిల్ చెట్లను కొందరు కొట్టి అమ్ముకుంటున్నారని, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని మండలంలోని రామవరప్పాడుకు చెందిన రత్నకుమారి అనే మహిళ వేడుకుంది. గురువారం ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని విలేకరుల ముందు వెల్లడించింది. వివరాలు..రత్నకుమారి తండ్రికి రామవరప్పాడులో 32 ఎకరాల పొలం ఉంది. ఆయనకు సుజాత, దేవసేనమ్మ భార్యలు. సజాతకు తెలియకుండా దేవసేనమ్మ 32 ఎకరాల పొలాన్ని స్వాధీనం చేసుకుంది. దీనిని తెలుసుకున్న సుజాతతో పాటు ఆమె కుమార్తెలు అయిన రత్నకుమారి, రాజేశ్వరి కోర్టును ఆశ్రయించారు. దీంతో దేవసేనమ్మకు కోర్టు సమన్లు పంపించడంతో పొలంలోని జామాయిల్ పంటను కొట్టకుండా స్టే ఆర్డర్ సైతం ఇచ్చింది. అయినా తన తండ్రి రెండో భార్య దేవసేనమ్మ కుమార్తెలు జామాయిల్ చెట్లను కొట్టుకుని అమ్ముకుంటున్నారని రత్నకుమారి ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే స్వీకరించకపోవడంతో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

చికెన్ వ్యర్థాల పూడ్చివేత

సంగం: ఇటీవల అక్రమంగా తరలిస్తున్న చికెన్ వ్యర్థాల వాహనాన్ని అధికారులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. గుంత తీసి చికెన్ వ్యర్థాలను పూడ్చిపెట్టాల్సిన అధికారులు డ్రమ్ములతో పాటు అలాగే కొండ సమీపంలో పడేశారు. దీంతో చికెన్ వ్యర్థాల నుంచి వెలువడే దుర్గంధంతో కొండ సమీపంలో పొలాలు కలిగిన రైతులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చికెన్ వ్యర్థాలను పూడ్చిపెట్టాలని అధికారులను కోరారు. దీంతో అధికారులు గురువారం సాయంత్రం సమయంలో గుంత తీసి చికెన్ వ్యర్థాలను పూడ్చివేశారు.

